సాక్షి నిర్మల్

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



గరిష్టం/కనిష్టం

36.0 /23.0

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. పలుచోట్ల ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది.



ఈద్గా మైదానంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



చించోలి ఈద్గాలో సందేశం వినిపిస్తున్న మత పెద్ద



శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు

ఈద్ ముబారక్

- జిల్లాలో ఘనంగా రంజాన్

నిర్మల్: జిల్లా వ్యాప్తంగా శనివారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. 'ఈద్ ముబారక్..' అంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పొద్దున్నే ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దల సందేశాలు ఆలకించారు. నిర్మల్‌లోని ఈద్గాంలో గల ఈద్గాలో ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. వేలాదిగా ముస్లింలు తరలివచ్చారు. వివిధ వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. కొంతమంది ముస్లింలు సారంగపూర్ మండలం చించోలి(బీ) సమీపంలో ఏర్పాటు చేసిన కొత్త ఈద్గాకు వెళ్లారు. అక్కడి ప్రార్థనల్లో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంబడి రాజేశ్వర్, అజర్, ఇమ్రానుల్లా తదితరులు ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చూశారు. ఖానాపూర్‌లో ముస్లింలను కలిసిన ఎమ్మెల్యే రేఖానాయక్ వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



చించోలి ఈద్గాలో మత పెద్దలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి ఐకేరెడ్డి



ఖానాపూర్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

న్యూస్‌రీల్

అమర జవాన్లకు నివాళి



నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

నిర్మల్ రూరల్: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారత జవాన్లకు శనివారం జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో స్ఫూర్తి నిర్మాణం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు అంగ జగదీశ్, శశిరాజ్, అనిల్, రాజభూషణ్, శ్రావణ్, డాక్టర్ ప్రవీణ్, శ్రీనివాస్, అర్జున్‌రెడ్డి, పాపేశ్వర్, బాలాజీ, రాజన్న తదితరులున్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ఏర్పడిన నుంచి రాష్ట్ర ప్రభుత్వం బీసీ నాయకులకు సముచితస్థానం కల్పించలేదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్మల్ కొత్త జిల్లాగా ఏర్పడిన తర్వాత కూడా ఈ ప్రాంత నాయకులకు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభా అత్యధికంగా కలిగిన నిర్మల్ జిల్లాలో బీసీ నాయకులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకుడు కత్రోజీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాచరిక పాలన'



'ఇంటింటికీ బీజేపీ'లో రాథోడ్ రమేశ్, నాయకులు

ఖానాపూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాచరిక పాలన సాగుతోందని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ ఆరోపించారు. శనివారం మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో సంక్షేమ పథకాలన్నీ కంటితుడుపు చర్యలేనని విమర్శించారు. ఇటీవల కురిసిన గాలివాన బీభత్సానికి నష్టపోయిన వారికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ పక్కా ఇళ్లతో పాటు కనీస సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు టేకు ప్రకాశ్, నాయిని సంతోష్, కొప్పుల భీమేశ్, డీ మల్లయ్య, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, లాండేరి కిషన్, ఒడ్నాల రాజేశ్వర్, పెట్టెం శేఖర్, పుల్లయ్య, మహేశ్, పోతుగంటి శేఖర్‌గౌడ్, ప్రవీణ్, మోతె శ్రీనివాస్, రాజన్న, ఎర్రన్న, అమంద రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ఖానాపూర్‌లో లెనిన్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలో శనివారం లెనిన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడారు. ప్రపంచ విప్లవాలకు దిక్సూచిగా నిలిచిన కామ్రేడ్ లెనిన్ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజన్న, భగవంత్‌రావు, లచ్చన్న, ప్రేమ్, సుభాష్, లింగన్న, శంకర్ తదితరులున్నారు.

దూరభారం తగ్గింది

- గోదావరి వంతెన మీదుగా నిజామాబాద్ నుంచి లోకేశ్వరానికి ఆర్టీసీ బస్సు
- హర్షం వ్యక్తంజేస్తున్న ప్రజలు

లోకేశ్వరం: అక్షయ తృతీయ పర్వదినాన నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి నిర్మల్ జిల్లా లోకేశ్వరం వరకు శనివారం ఆర్టీసీ బస్సు ప్రారంభమైంది. లోకేశ్వరం మండలం పంచగుడి శివారు ప్రాంతంలో గోదావరి నదిపై నిర్మించిన వంతెన మీదుగా లోకేశ్వరం వరకు బస్సు వచ్చింది. లోకేశ్వరం, దిలావర్‌పూర్, నర్సాపూర్, కుంటాల మండలాల ప్రజలు ఇన్నాళ్లు నిజామాబాద్‌కు వెళ్లాలంటే బాసర మీదుగా లేదా నిర్మల్, ఆర్మూర్ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. దీంతో 100 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ దూరం సగానికి తగ్గింది. పంచగుడి గోదావరి నదిపై 600 మీటర్ల దూరంలోగల వంతెనతో లోకేశ్వరం నుంచి నేరుగా నందిపేట్ మండల కేంద్రానికి వెళ్లే వీలు కలిగింది. లోకేశ్వరం మండల కేంద్రానికి నిజామాబాద్–1 డిపో నుంచి బస్సులు నడుపుతున్నారు. నిజామాబాద్ నుంచి లోకేశ్వరానికి వెళ్లాలంటే ఉదయం 7.15, లోకేశ్వరం నుంచి నిజామాబాద్‌కు వెళ్లాలంటే సాయంత్రం 6.10గంటలకు బస్సు అందుబాటులో ఉంటుంది. నందిపేట్ నుంచి లోకేశ్వరానికి ఉదయం 8.15, మధ్యాహ్నం 1.00, సాయంత్రం 5.10, అలాగే లోకేశ్వరం నుంచి నందిపేట్‌కు ఉదయం 9.20, 11.45, మధ్యాహ్నం 2.00, 4.00, సాయంత్రం 6.10 గంటలకు బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



డ్రైవర్, కండక్టర్‌ను సన్మానిస్తున్న సర్పంచులు

దూరం దగ్గరైంది



నా బిడ్డను లోకేశ్వరం మండలం ధర్మోర గ్రామానికి చెందిన వ్యక్తికిచ్చి పెండ్లి చేసిన. అప్పట్లో వేసవిలో పుట్టి ఎక్కి ఆ ఊరు వెళ్లాల్సి వచ్చేది. వానాకాలంలో కష్టమయ్యేది. బస్సులు మార్చి వెళ్తే గాని బిడ్డ దగ్గరికి వెళ్లడం సాధ్యమయ్యేది కాదు. ఇప్పుడు వంతెన పూర్తి కావడం సంతోషంగా ఉంది. బస్సులో అరగంటలో బిడ్డ ఊరికి పోత. – మగ్గిడి రుక్మాబాయి, సీహెచ్ కొండూర్

ఖర్చులు తగ్గుతాయి



రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే పంచగుడి మీదుగా నందిపేట్‌కు 12 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. తిరిగి బాసర గుండా వెళ్లాలంటే 90 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. బస్సు ప్రారంభించడంతో రవాణా ఖర్చులు తగ్గుతాయి. అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం అందుతుంది. అన్ని రకాల సౌకర్యాలు చేరువలోకి వస్తాయి. – దేవన్న, కన్కపూర్

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సారంగపూర్: వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ శిబిరం కోఆర్డినేటర్, జామ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి సూచించారు. మండలంలోని జామ్ గురుకులంలో శనివారం వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. శిబిరంలో లైఫ్ స్కిల్స్, జర్నలిజం, కూచిపూడి నృత్యం, జానపదం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిబిరానికి జామ్‌తోపాటు కడెం, భైంసా, లెఫ్ట్‌పోచంపాడ్, ముథోల్ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. లైఫ్‌స్కిల్స్ శిక్షకులుగా శ్యామల షిండే, శ్రావణి, కూచిపూడి, జానపద శిక్షకులుగా రామదాసు, యమున, యంగ్ జర్నలిజం శిక్షకులుగా శ్రీలత, లక్ష్మి, బ్రైటర్‌మైండ్స్ శిక్షకులుగా సునీత వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్లు స్వరూపారాణి, రాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమాకళ్యాణి

గోదావరికి హారతి



భైంసా: అక్షయ తృతీయ, గంగ పుష్కరాలను పురస్కరించుకుని బాసరలో భక్తులు శనివారం సాయంత్రం గోదావరినదికి హారతి ఇచ్చారు. హారతి ఘాట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు.

సెల్‌వుల్లో ఆటలేనా..!

సండే స్పెషల్

- పిల్లల్లో పెరిగిన మొబైల్ వీక్షణం
- రోజుకు సగటున మూడు గంటలపైనే..
- క్రీడల్లో శిక్షణ వైపు దృష్టి మళ్లిస్తే మేలు

సాక్షి, మంచిర్యాల డెస్క్: వేసవి సెలవులు వస్తున్నాయంటే చాలు పిల్లల్లో ఎక్కడా లేని సంబరం. అదే సమయంలో తల్లిదండ్రుల్లో ఓ వైపు ఆనందం.. మరోవైపు ఆందోళన. ఏడాదంతా తీరిక లేకుండా చదివిన పిల్లలకు కాస్త తీరిక దొరికిందని ఆనందమైతే.. సెలవుల్లో మొబైల్ ఫోన్ అతి గా వాడడం, అల్లరి చేష్టలతో ఎక్కడ ప్రాణాల మీదికి తెచ్చుకుంటా రోననేది ఆందోళనకు కారణం. 69శాతం మంది పిల్లలు రోజులో సగటున మూడు గంటల కంటే ఎక్కువగా సమయాన్ని మొబైల్ ఫోన్ వీక్షించడానికే కేటాయిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. 96శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్ వైపు ఆకర్షితులు కాకుండా ఉండడానికి ఏం చే యాలో తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారని సర్వే వెల్లడించింది. గతంలో విహార యాత్రలకు వెళ్లడం, అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లడం చేసేవారు. కానీ ప్రస్తుతం అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లే వారి సంఖ్య చాలావరకు తగ్గింది. పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తే మేలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పెరిగిన వినియోగం

కరోనా కారణంగా ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడంతో పిల్లల్లో చాలామందికి మొబైల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు, జీవనోపాధి నిమిత్తం పనులకు వెళ్లిన సందర్భంలో క్షేమ సమాచారం కోసం సెల్‌ఫోన్లను అందుబాటులో ఉంచుతున్నారు. కారణమేదైనప్పటికీ విద్యార్థుల్లో చాలామందికి సొంతంగా ఫోన్ ఉంటోంది. పదేళ్లలోపు పిల్లల్లో 42శాతం మంది, 12ఏళ్లలోపు పిల్లలు 71శాతం మంది, 14ఏళ్లలో వారు 91శాతం మంది వ్యక్తిగత మొబైల్ ఫోన్లను కలిగి ఉన్నారు. దీంతో సెల్‌ఫోన్లలో ఆటలు ఆడేస్తూ.. రీల్స్ చూసేస్తూ.. సామాజిక మాధ్యమాల్లో కాలం గడిపేస్తున్నారు.

జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య

జిల్లాలు	1నుంచి 10వ తరగతి వరకు	ఇంటర్ విద్యార్థులు
ఆదిలాబాద్	1,39,421	19,396
మంచిర్యాల	1,16,250	14,668
నిర్మల్	52,667	6,621
కుమురంభీం	90,168	9,933

నియంత్రణ సాధ్యమే..

తల్లిదండ్రులు పిల్లలపై కాస్త దృష్టి సారిస్తే మొబైల్‌ఫోన్ వినియోగం నియంత్రణ సాధ్యమే. స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఫోన్లలో పెరెంటల్ కంట్రోల్ అనే ఆప్షన్‌లో అందుబాటులోకి తెచ్చాయి. సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫోన్ వినియోగ సమయాన్ని నిర్ధారించుకోవాలి. ప్లేస్టోర్‌లోనూ పలు ఆప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఏయే ఆప్‌లు ఎంత ఉపయోగిస్తున్నారు.. ఎంత సమయం ఉపయోగించుకోవాలి అనే సమయాన్ని సూచించుకోవచ్చు.

క్రీడా శిక్షణ శిబిరాలు

విద్యార్థులకు వివిధ ఆటలపై ఉచితంగా శిక్షణ అందించేందుకు జిల్లా యువజన క్రీడల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. మే ఒకటి నుంచి 31వరకు ఆయా ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఫుట్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, తైక్వాండో, చెస్, ఉష్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. మంచిర్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పది, పట్టణ ప్రాంతాల్లో పది శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. కుమురంభీం జిల్లాలో పది, నిర్మల్ జిల్లా కేంద్రంలో 6, భైంసాలో 4, ఖానాపూర్‌లో 3, నిర్మల్ నియోజకవర్గం గ్రామీణ ప్రాంతాల్లో 43, ముథోల్‌లో 42, ఖానాపూర్‌లో 17, ఆదిలాబాద్ జిల్లాలో పది క్రీడాశిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి



పిల్లల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించాలనే ఉద్దేశంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. క్రీడా శిక్షణ శిబిరాలను ఉత్సాహవంతులైన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. క్రీడల్లో మెలకువలు నేర్చుకుని, నైపుణ్యాలను మెరుగుపర్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదిగేలా శిక్షకులకు సూచనలు అందజేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడల అధికారి, ఆదిలాబాద్

మానసిక ఎదుగుదల లోపిస్తుంది..



పిల్లలు సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడడం వల్ల మానసిక ఎదుగుదల లోపిస్తుంది. చలాకీతనం తగ్గుతుంది. కంటి సమస్యలు, మెడలో కండరాల బలహీనత ఏర్పడుతుంది. పాత కాలంలో ఆడే ఆటలు ఇప్పటి పిల్లలు ఆడడం లేదు. తల్లిదండ్రులు పిల్లలను ఇండోర్, ఔట్‌డోర్ గేములు ఆడే విధంగా చూడాలి. బంధువుల ఇంటికి వెళ్లకపోవడంతో సమాజ సంబంధాలు తగ్గుతున్నాయి. వేసవి కాలంలో పిల్లలను పిక్నిక్‌లు, వినోదాలకు తీసుకెళ్లడం వల్ల వారిలో ప్రశాంతత నెలకొంటుంది. అవసరమైతే తప్ప పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకూడదు. ఎక్కువ సేపు ఫోన్లు చూడడం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గుతుంది. తల్లిదండ్రులు ఈ విషయంలో ఆలోచించడం మంచిది.

– క్షత్రం వెంకట్‌రెడ్డి, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆదిలాబాద్

స్మార్ట్‌గా అనారోగ్య సమస్యలు



సెల్‌ఫోన్ అనేది నిత్యావసర వస్తువుగా మారిపోయింది. అతిగా సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న పిల్లాడి నుంచి ముదుసలి వరకు సెల్‌ఫోన్ తప్పనిసరి. చిన్నపిల్లల్లో కంటి చూపు మీద ఎక్కువగా ప్రభావం చూపుతుంది. స్మార్ట్‌ఫోన్ అలవాటుతో పిల్లలకు ఏమీ తోచదు. స్మార్ట్ ఫోన్ తెర నుంచి వచ్చే నీలిరంగు లైటు పిల్లల కంటి చూపుపై ప్రభావం చూపుతుంది. దాంతో చిన్నప్పుడే ఐసైట్ సమస్య వచ్చి కళ్ల జోడు పెట్టుకోవాల్సి వస్తుంది. వినికిడి లోపానికి అవకాశం ఉంది. నిద్రలేమి సమస్య రావచ్చు. జ్ఞాపకశక్తిపై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. తలనొప్పి, బ్యాక్‌పెయిన్ సమస్యలు తలెత్తుతాయి. పిల్లల చేతికి ఎటువంటి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ ఇవ్వొద్దు. మెదడు ఎదుగుదలను దెబ్బతీసి, వర్చువల్ ఆటిజంను కలిగిస్తుంది. చికాకు, అసహనం, కోపం, తిరుగుబాటు ధోరణి పెరుగుతుంది. సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లి వేలల్లో ఖర్చు చేసినా ఒక్కోసారి ఫలితం దక్కకపోవచ్చు.

– డాక్టర్ సునీల్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

పిల్లలపై తీవ్ర ప్రభావం



సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తే పెద్దవాళ్లపైనే ప్రభావం చూపుతుంది. అలాంటిది చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల చేతుల్లో గంటల పాటు ఫోన్ పెట్టేస్తున్నారు. అలా చూడడం వల్ల పిల్లల మెదడుపై రేడియేషన్ ప్రభావం పడుతుంది. కంటితోపాటు వెన్ను సమస్యలు వస్తాయి. మొబైల్‌లో ఒక్కోసారి వివిధ సైట్లు, వీడియోలు చూడడం వల్ల పిల్లలపై మానసికంగానూ ప్రభావం పడుతుంది. తల్లిదండ్రులు సాధ్యమైనంత వరకు పిల్లలను ఫోన్ నుంచి దూరం చేయాలి.

– డాక్టర్ నాళం స్వప్న, చిన్నపిల్లల వైద్యురాలు, నిర్మల్

క్లుప్తంగా

కుక్కలదాడిలో చుక్కల దుప్పికి గాయాలు



దుప్పిని అప్పగిస్తున్న స్థానికులు

పెంబి: మండల కేంద్రంలోని కొత్తగూడెం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పిని ఊర కుక్కలు తరుముకుంటూ కొత్త గూడెంకు రాగా.. స్థానికులు రక్షించి ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ అప్పగించారు. దుప్పికి స్వల్ప గాయాలు కావడంతో వైద్యం చేసి సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు తెలిపారు. చుక్కల దుప్పిని అప్పజెప్పిన స్థానికులకు ఫారెస్ట్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో ఎఫ్‌బీవో ఆశిశ్ ఉన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లోకారి గ్రామానికి చెందిన అరుగుల అశోక్(58) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం.. లోకారి గ్రామానికి చెందిన అశోక్ గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా వ్యాధి తగ్గకపోవడంతో శనివారం వేకువజామున 3గంటల ప్రాంతంలో ఇంట్లో పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడి భార్య సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

దస్తురాబాద్: మండలంలోని బుట్టపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నూర్‌కు చెందిన నరేందుల శివకుమార్ (43) గల్ఫ్‌లో మృతిచెందగా శనివారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. వివరాల ప్రకారం.. శివకుమార్ సొంత గ్రామం జన్నారం మండలంలోని చింతగూడా కాగా చెన్నూర్ గ్రామంలో కుటుంబంతో ఉంటున్నాడు. మూడు నెలల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఈ నెల 12న అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహం శనివారం ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు.

పాముకాటుకు ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

నేరడిగొండ: మండలంలోని గుత్పాలకు చెందిన ఉడుగుల పెద్ద గంగయ్యకు చెందిన ఎద్దు శనివారం పాముకాటుతో మృతిచెందింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పశువుల పాకలో రోజువారీ లాగే ఎద్దులను ఉంచగా మేత వేయడానికి వెళ్లేసరికి ఎద్దు మృతి చెంది కనిపించింది. పశువైద్య సిబ్బంది చేరుకుని పాముకాటుతో మృతిచెందినట్లు ధృవీకరించారు. ఎద్దు విలువ రూ.40వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఆలయాలే టార్గెట్

- వరుస దొంగతనాలు
- వారం రోజుల్లో మూడు ఆలయాల్లో చోరీలు
- ప్రశ్నార్థకమవుతున్న పోలీసు భద్రత
- నిఘా నేత్రాలున్నా.. చిక్కకుండా పోతున్న దొంగలు

ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో సోమవారం రాత్రి శివాలయంలో చోరీ జరిగింది. గుడిలోని హుండీ పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. సీసీ కెమెరా, డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు. ఇలాంటి సంఘటన గత పది రోజుల్లో ఇది మూడోవది. ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలకైతే భద్రత లేకుండా పోయింది.



రాంనగర్‌లోని శివాలయంలో చోరీకి పాల్పడుతున్న దుండగులు సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యాలు



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను మాయం చేసిన దొంగలు తాజాగా ఆలయాలను టార్గెట్ చేశారు. నెల రోజుల క్రితం తాళం ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడగా, ప్రతిరోజు ఏదో ఒక చోటా జిల్లాలో దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో జనాలు భయాందోళనలకు గురవుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దొంగలతో పాటు అంతర్రాష్ట్ర దొంగలు జిల్లాపై కన్నేశారు. నిఘా నేత్రాలు ఉన్నప్పటికీ వాటికి చిక్కకుండా చాకచక్యంగా తమ పని కానిస్తున్నారు. వరుస దొంగతనాలతో పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కొంతమంది జనాలు ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ చేయడంలో పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలరోజుల క్రితం చోరీకు గురైన వాహనాలకు ఇటీవల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం గమనార్హం.

ఆలయాలే టార్గెట్..

వారం పది రోజుల్లో మావల పోలీసుస్టేషన్ పరిధిలోనే మూడు ఆలయాల్లో చోరీలు జరిగాయి. వరుసగా చోరీలు జరిగినప్పటికీ దుండగులు పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నారు. మూడు ఆలయాలకు సంబంధించి కూడా ఆ దుండగులే దొంగతనాలకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటిని సైతం అపహరించుకుపోతున్నారు. ఆలయాల్లో అమ్మవారి నగలు, నగదు హుండీలను సైతం దోచుకెళ్తున్నారు. రాంనగర్‌లోని హనుమాన్ ఆలయంతో పాటు శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరగగా, వారం రోజుల క్రితం సాయినగర్‌లోని రేణుక మాతా ఆలయంలో 3 కిలోల వెండీ, బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

సీసీ కెమెరాలకు చిక్కకుండా..

ఇటీవల కాలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. బైక్‌లపై వచ్చి మహిళల మెడలో నుంచి ఆభరణాలు, పాదచారుల సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లడం, తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకొని అందినకాడికి దోచుకోవడం వంటివి చేస్తున్నారు. ఇటీవల చోరీలకు గురైన 19 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఆ దుండగులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంక వందలాది బైక్‌ల ఆచూకీ లభించడం లేదు. ఆదిలాబాద్ పట్టణంలోని ఆయా కూడళ్లలో 150 వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా వీటికి కూడా చిక్కకుండా దొంగలు జాగ్రత్త పడుతున్నారు.

దొంగలను గుర్తించాం



ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దుండగులను గుర్తించాం. త్వరలో వారిని పట్టుకుంటాం. ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న దొంగలను ఇదివరకే పట్టుకోవడం జరిగింది. 19 బైక్‌లను స్వాధీనం చేసుకున్నాం. కాలనీల్లో అనుమానితులు తిరిగితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో దొంగలను సులువుగా పట్టుకునే అవకాశం ఉంటుంది.

– డి.ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎస్పీ, ఆదిలాబాద్

కరువైన భద్రత..

వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీసు భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెట్రోలింగ్‌తో పాటు గస్తీ తిరుగుతున్నామని చెబుతున్నప్పటికీ దొంగతనాలకు మాత్రం బ్రేక్ పడటం లేదు. గత రెండు నెలలుగా జిల్లాలో వరుసగా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అంతర్రాష్ట్ర దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 50కి పైగా దొంగతనాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్



సెల్ టవర్ పై లక్కం చంద్రయ్య

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామంలో కుటుంబ సభ్యుల కలహాలతో శనివారం లక్కం చంద్రయ్య సెల్ టవర్ ఎక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. రేవోజీపేట గ్రామానికి చెందిన లక్కం చంద్రయ్య వృద్ధురాలైనా తల్లి లక్కం లక్ష్మవ్వను చూసుకోవటం లేదని తోబుట్టువు దొంగల గంగవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపానికి గురైన చంద్రయ్య గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రభాకర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడి సెల్ టవర్ దిగి వచ్చేలా చేశారు. దీంతో అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళను బెదిరించి బంగారం అపహరణ

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని గోపాల్ నగర్‌లో గుర్తు తెలియని దుండగులు శనివారం ఓ ఇంట్లోకి చొరబడి పది తులాల బంగారం అపహరించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... అచ్చులాపూర్, రేచినీ క్రాస్‌రోడ్ మూల మలుపు వద్ద బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి చౌదరి కుటుంబం నివాసం ఉంటోంది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇద్దరు యువకులు పథకం ప్రకారం ముఖానికి ముసుగేసుకుని ఇంట్లో చొరబడ్డారు. ఆసమయంలో చౌదరి భార్య పద్మజ మాత్రమే ఇంట్లో ఉంది. అగంతకులు ఆమెను కత్తితో బెదిరించి వొంటిపై ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు లాక్కున్నారు. బీరువా తాళాలు కూడా ఇవ్వాలని బెదిరించడంతో మహిళ కేకలు వేసింది. దీంతో దుండగులు పారిపోయారు.

నిన్న బీఆర్ఎస్‌లోకి.. మరుసటి రోజే బీజేపీలోకి



మంత్రి అల్లోల నివాసంలో బీఆర్ఎస్‌లోకి..



శనివారం మళ్లీ బీజేపీలో చేరిన కార్యకర్తలు

సారంగపూర్: వివిధ పార్టీల కార్యకర్తలు రోజుకో పార్టీ మారుతున్నారు. నిర్మల్ రాజకీయాల్లో ఒక్కసారిగా మార్పులు రావడంతో ఎటూ తేల్చుకోలేని కార్యకర్తలు ఏకంగా రోజుకో పార్టీ మారుస్తూ ఔరా..... అని ముక్కున వేలేసుకునేలా వ్యవహరిస్తున్నారు. ఇందుకు నిదర్శనం బీజేపీ కార్యకర్తలే. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన సాగర్, రాజు, విజయ్, సాయన్న అనే నలుగురు యువకులతో పాటు మరికొంతమంది బీజేపీ కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి స్వయంగా మంత్రి అల్లోల కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. తీరా శనివారం ఉదయం ఈనలుగురు కార్యకర్తలు బీఆర్ఎస్ నుంచి మళ్లీ బీజేపీలోకి చేరారు. ఒక్కరోజులో పార్టీ ఎలా మారారని విచారించగా తమ సమస్యలను మంత్రికి వివరిస్తామని వెళ్తే కండువాలు కప్పారని వారు తెలుపడం కొసమెరుపు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు విలాస్ వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీ నాయకులు రాంశంకర్‌రెడ్డి, వీరయ్య, చంద్రప్రకాష్ గౌడ్, తిరుమలచారి, ఆడెపు మహేందర్, నర్సయ్య ఉన్నారు.

'బీజేపీతోనే దళితులకు న్యాయం'



మాట్లాడుతున్న దేవేందర్

నిర్మల్‌రూరల్: ప్రధాని మోదీ, బీజేపీ ద్వారానే దళితులకు న్యాయం జరుగుతుందని పార్టీ దళిత మోర్చా ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ దేవేందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బీజేపీ దళిత జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో దళిత మోర్చా క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. దళితులను ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు మరిచి దళితులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అంబేద్కర్ ఆశయాలు సాధించేది బీజేపీ మాత్రమేనని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, నాయకులు మెడిసిమ్మె రాజు, నర్సాగౌడ్, రవీందర్, సాహెబ్‌రావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ, పెంబి జెడ్పీటీసీ జానుభాయ్, ఉంగరాల రాజు, నవీన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నిర్మల్‌కు మహేశ్వర్‌రెడ్డి రాక



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌రూరల్: నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరిన తర్వాత తొలిసారిగా సోమవారం జిల్లా కేంద్రానికి రానున్నారు. శనివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, నాయకులు మెడిసిమ్మె రాజు, నాందేడపు చిన్నులు రూట్ మ్యాప్‌ను ప్రకటించి విలేకరులతో మాట్లాడారు. మహేశ్వర్ రెడ్డి హైదరాబాద్ నుండి సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ బైపాస్ బ్రిడ్జి వద్దకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుంటారని, అక్కడ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన అనంతరం తన నివాసానికి చేరుకుంటారు. నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నుండి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఇందులో ముత్యం రెడ్డి, కొండాజి శ్రావణ్, కుమ్మరి వెంకటేష్, ఆకుల కార్తీక్, విజయ్, భరత్, జింక సురేష్, కూన శివకుమార్ పాల్గొన్నారు.

మళ్లీ ఖానాపూర్ ఎమ్మెల్యే నేనే..!



జాన్సన్ నాయక్‌తో ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీచేసి ఖానాపూర్ ఎమ్మెల్యేగా తానే గెలుపొందుతానని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ శనివారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా వద్దకు వచ్చిన ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ నాయకుడు, మంత్రి కేటీఆర్ మిత్రుడు జాన్సన్ నాయక్ ఎదురుకావడంతో ఎమ్మెల్యే ఆయనను కలిసి ఆయన సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఇక్కడి నుంచే పోటీచేస్తానని జాన్సన్‌నాయక్‌కు వేరే చోట పోటీచేసేందుకు వెళ్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్‌చైర్మన్ కలీల్, మాజీ జెడ్పీటీసీ రాము నాయక్, పార్టీ మండలాధ్యక్షుడు రాజగంగన్న, పట్టణాధ్యక్షుడు పరిమి సురేష్ ఉన్నారు.

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం



సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: అధిష్టానం ఎవరికి టికెట్ ఇస్తే వారితో కలిసి తాము పనిచేసి ఖానాపూర్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని బీఆర్ఎస్ నాయకుడు, మంత్రి కేటీఆర్ మిత్రుడు భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మొదటిసారి ఖానాపూర్‌లో మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో సెల్ఫ్ డిక్లరేషన్ ఉండదని, వందశాతం తాను ఖానాపూర్ ఎమ్మెల్యే టికెట్ కోసం ఆశిస్తున్నానని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా ఎమ్మెల్యే టికెట్ కోసం జాన్సన్ నాయక్ చేస్తున్న ప్రయత్నాలు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బహిర్గతమయ్యాయి. గత కొద్దినెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో మంత్రి కేటీఆర్ సాక్షాత్తు జాన్సన్‌నాయక్ తన చిన్ననాటి మిత్రుడని, ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వస్తానని అంటున్నాడని కేటీఆర్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆయన వెంట వెంకటేశ్వర్‌రావు, ఎర్రన్న, బలగం రమేష్, కరిపె రాజశేఖర్, సాబీర్, సాయి నరేష్, శ్రీకాంత్, కోల శ్రీనివాస్, బండి బుచ్చాగౌడ్, చుక్క రాకేశ్ ఉన్నారు.

డీఎస్పీని ఆశ్రయించిన యువతి

- ప్రేమించి మోసం చేశాడని ఆవేదన
- న్యాయం చేయాలని గిరిజన సంఘాల డిమాండ్



డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రేమించి మోసం చేశాడని తనకు న్యాయం చేయాలని ఓ యువతి డీఎస్పీని ఆశ్రయించింది. శనివారం గిరిజన సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్‌కు ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... బోథ్ మండలానికి చెందిన యువతి అదే మండలంలోని బబేరకు చెందిన సెడ్మకి విద్యాసాగర్ వరుసకు మేనబావ ఆదిలాబాద్ పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇరువురు 2015 నుంచి ప్రేమించుకుంటున్నారు. బాధితురాలు కరీంనగర్‌లో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలో అద్దెకు ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతోంది. విద్యాసాగర్ తన అక్కపెళ్లి అయిన తర్వాత పెళ్లి చేసుకుందామని నమ్మబలికాడు. 2022లో యువతి గర్భవతి కాగా మెడిసిన్ ఇచ్చి అబార్షన్ చేయించాడు. ఇటీవల ఓ ఉపాధ్యాయురాలితో పెళ్లి నిశ్చితార్థం చేసుకోగా విషయం తెలుసుకున్న యువతి నిలదీసింది. దీంతో విద్యాసాగర్ పెళ్లికి నిరాకరించాడు. బాధితురాలు బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు పట్టించుకోలేదని, గత నెలలో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పలు సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు. దీంతో విద్యాసాగర్ తండ్రి బాధితురాలికి రూ.4లక్షలు ఇస్తానని, తన కుమారుడిని వదిలిపెట్టాలని కోరాడు. అంతే కాకుండా బోథ్‌లో ఉంటున్న బాధితురాలి కుటుంబ సభ్యులపై విద్యాసాగర్ తండ్రి మాధవరావు దాడికి పాల్పడ్డాడు. దీంతో బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేశారు. తనకు న్యాయం చేయాలని డీఎస్పీకి విజ్ఞప్తి చేసింది. బాధితురాలికి పలు గిరిజన సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మోసం చేసిన విద్యాసాగర్ పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులపై దాడి చేసిన మాధవరావ్‌పై సైతం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఘనంగా అక్షయ తృతీయ



బంగారం కొనుగోలు చేస్తున్న మహిళలు

నిర్మల్: జిల్లావ్యాప్తంగా శనివారం అక్షయ తృతీయ జరుపుకొన్నారు. ఇళ్లల్లో లక్ష్మీసత్య నారాయణ స్వామి పూజలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లోనూ పూజలు కొనసాగాయి. అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే మేలు జరుగుతుందన్న నమ్మకంతో పలువురు బంగారం దుకాణాలకు వెళ్లారు. జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్, బుధవార్‌పేట్‌లోగల బంగారు, వెండి దుకాణాలు సందడిగా కనిపించాయి.

భైంసా: అక్షయ తృతీయ సందర్భంగా భైంసాలోని గాంధీగంజ్, పల్లెల్లోని విత్తన విక్రయ కేంద్రాల్లో విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేశారు. తొలకరి చినుకులు పడగానే ఈ రోజు కొనుగోలు చేసిన విత్తనాలనే పంటపొలంలో ముందుగా నాటడం ఇక్కడి రైతుల ఆనవాయితీ. బంగారం దుకాణాల్లో సందడి కనిపించింది.

తాగునీటి కోసం మహిళల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో శనివారం తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులను నిలదీశారు. తమకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. చేతి పంపులు పనిచేయడం లేదని, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని వాపోయారు. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. వెంటనే స్పందించిన పాలకవర్గం తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన భీమ బుచ్చన్న తాత్కాలికంగా తమ చేనులో నుంచి పైపుల ద్వారా నీటిని అందిస్తానని తెలిపారు.

దొంగ నంబర్ ప్లేట్ కారు యజమానులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దొంగ నంబర్ ప్లేట్‌తో కారు నడుపుతున్న యజమానులపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరికి చెందిన గౌరు కార్తీక్ మారుతి షిఫ్ట్ వాహనం (టీఎస్01ఈఎం2828) ఉంది. శనివారం ఇంట్లో తన కారును ఉంచి ఆదిలాబాద్ పట్టణానికి వచ్చాడు. జామ మసీదు వద్ద తన కారు నంబర్‌తో ఉన్న వాహనం కనిపించడంతో కుటుంబీకులకు ఫోన్ చేశాడు. కుటుంబీకులు వాహనం ఇంటి వద్దే ఉందని తెలిపారు. దీంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన నాందేవ్, భూమేశ్‌లు ఈ వాహనానికి యజమానులు కాగా ఈ వాహనం (టీఎస్01యూసీ1863) పై ఫైనాన్స్ ఉండడంతో దొంగనంబర్‌తో తిరుగుతున్నారు. వీరిద్దరిపై పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమ్మర్ క్యాంపు నుంచి 13మంది విద్యార్థులు పరార్

- రైల్వేస్టేషన్‌లో ఆచూకీ లభ్యం
- సీడబ్ల్యూసీకి అప్పగించిన రైల్వే సిబ్బంది



విద్యార్థులతో సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: సమ్మర్ క్యాంపునకు వచ్చిన విద్యార్థులు సౌకర్యాలు సరిగా లేవని పాఠశాల నుంచి పరారయ్యారు. మావల మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నెల రోజుల పాటు ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమం కింద శిక్షణ కల్పిస్తున్నారు. వీరికి 10వ తరగతి సెలబస్ బోధిస్తున్నారు. ఇదిలా ఉండగా నిర్మల్ జిల్లా భైంసా జమ్‌గాం మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు శుక్రవారం మావలలో ఏర్పాటు చేసిన క్యాంపునకు 13మంది వచ్చారు. రాత్రి అక్కడే నిద్రపోయి శనివారం తెల్లవారుజామున బైపాస్ నుంచి వెళ్లి ఉదయం 11 గంటలకు రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షమయ్యారు. వీరి దగ్గర డబ్బులు లేకపోవడంతో రైలులో ఎక్కి బాసరలో దిగాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ విద్యార్థులందరినీ రైల్వే పోలీసులు చూసి ఆరా తీశారు. సమ్మర్ క్యాంపు నుంచి వచ్చినట్లు చెప్పారు. దీంతో రైల్వే పోలీసులు డీసీపీవో, సీడబ్ల్యూసీ కమిటీకి సమాచారం ఇచ్చారు. వెంటనే సీడబ్ల్యూసీ కమిటీ రైల్వే స్టేషన్‌కు చేరుకుని విద్యార్థులను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సమ్మర్ క్యాంపులో సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో తాము తిరిగి ఇంటికి వెళ్లేందుకు నిర్ణయించుకున్నామని ఆ విద్యార్థులు అధికారులకు తెలియజేశారు. ఆదిలాబాద్ సీడబ్ల్యూసీ కమిటీ రెండు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి వారిని నిర్మల్ సీడబ్ల్యూసీ కమిటీకి అప్పగించింది. ఇందులో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, డేవిడ్, రాజేంద్రప్రసాద్, తిరుపతి ఉన్నారు. ఈ విషయమై మావల పాఠశాల ప్రిన్సిపాల్ రంగన్నను వివరణ కోరగా చదువుకోవడం ఇష్టం లేక ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లారని పేర్కొన్నారు. వారిని స్వస్థలం పంపించినట్లు తెలిపారు.